


శ్రమదానంతో రోడ్డు గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని బొర్రా, కోనాపురం పంచాయతీల పరిధిలోని రోడ్డు గోతులను గిరిజనులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమాదానంతో పూడ్చి వేశారు. పనులను రెండు రోజులుగా చేపడుతున్నారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా బొర్రా, చప్పుడి, కోనాపురం, కితలంగి, అత్తిమాల, కరాయిగూడ వరకు సుమారు 15 కిలోమీటర్లు మేర రోడ్డంత కోతులుగా ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తడంతో ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు ముందుకు వచ్చి ఈ పనులను చేపడుతున్నారు. ప్రభుత్వం రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు గుంతలను పూడుస్తున్న గిరిజనులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో

పోషకాహారం పంపిణీలో జాప్యం తగదు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు: అంగన్వాడి కేంద్రాల్లో లబ్దిదారు లకు పోషకాహారం పంపిణీలో జాప్యం తగ్గదని, పాలు పంపిణీ చేయకుండా కేంద్రాలలో నిల్వలు ఉంచితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. ప్రతీ నెలా బాలింతలకు, గర్భవతులకు, చిన్నారులకు బలవర్ధకమైన పోషకాహారాలను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎనిమియా నివారణకు పటిష్టమై చర్యలు తీసుకోవాలని సూచించారు. పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల సిడిపిఓలు, సూపర్ వైజర్లతో శనివారం కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పోషకాహారం పంపిణీపై సమావేశం నిర్వహించారు. అక్టోబరు నెలకు సంబంధించిన పాలు, గుడ్లు, సంపూర్ణ పోషణ ప్లస్ పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు పంపిణీ చేసామని ధృవీకరణ పత్రం సమర్పించాలని సిడిపి ఓలను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరకులు ఎక్కడా నిల్వ ఉండటానికి లేదని స్పష్టం చేసారు. చిన్న పిల్లలకు పాలు సరఫరాలో జాప్యం చేయకూడదన్నారు. లబ్ధిదారులు అంగన్వాడీలకు ఏకారణం చేతనైనా రాకపోతే ఇళ్లకు సరుకులు పంపించాలని ఆదేశించారు అంగన్వాడీ కేంద్రాలకు డీలర్లు ఆయిల్‌ను సకాలంలో పంపిణీ చేయలేదని సిడిపి ఓలు కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. బియ్యం, ఆయిల్ పంపిణీలో సమస్యలుంటే తహాశీల్దార్లకు, సబ్ కలెక్టర్కు ఫిర్యాదు చేయాలని సిడిపిఓలకు సూచించారు. పాలు పంపిణీ చేయడానికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సెంకండరీ ట్రాన్స్పోర్టేషన్ కు ఎన్ని వాహనాలు ఉన్నాయి? నెలకు ఎన్ని వాహనాలు పెట్టాలి, ఎన్ని పెడుతున్నారని ప్రశ్నించారు. పూర్తి స్థాయిలో వాహనాలను ఏర్పాటు చేయవలసిన బాధ్యత కాంట్రాక్టరు పైనే ఉందన్నారు.సిడిపిఓలు క్లస్టర్ల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. సూపర్ వైజర్‌లు నెలకు 20 అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని చెప్పారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ సక్రమంగా పంపిణీ చేసి రక్తహీనత లోపాలను నివారించాలన్నారు. అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు పనిచేయకుండా బినామీలతో పని చేయడానికి వీలు లేదన్నారు. గర్భవతుల ప్రసవ సమయాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అంగన్వాడీ సేవల్లో మహిళా పోలీసులను వినియోగించాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలలో నాడు నేడు పనులకు ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని కలెక్టర్ తెలిపారు. పనులు పూర్తి చేయాలన్నారు. సూపర్ వైజర్లు, సిడిపిఓలు, అంగన్వాడీ భవన నిర్మాణాలను పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం గర్భవతులకు బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్‌ను పంపిణీ చేసారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, సిడిపి ఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



పర్యాటక బోట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

పాపికొండల విహార యాత్రకు పర్యాటక బోట్లు ప్రారంభం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

నాలుగు నెలలు అనంతరం రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఉత్తర్వులు మేరకు శనివారం పాపికొండల విహారయాత్రకు సంబంధించిన బోట్లును అధికారులు ప్రారంభించారు. గండి పోచమ్మ గండి బోటింగ్ పాయింట్ వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి శనివారం విహారయాత్ర బోటుల ట్రైలర్ రన్ చేసి పరిశీలించారు. నాలుగు నెలల నుండి అధిక వర్షాలు, గోదావరి వరదల వలన నిలిచిపోయిన విహారయాత్ర బోట్లను తిరిగి శనివారం ప్రారంభించినట్లు మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. బోట్ల లైసెన్సులతో పాటు పూర్తి భద్రతా కిట్లుతో బోట్లను నడపడం జరుగుతుందని చెప్పారు. పాపికొండల విహారయాత్రకు సందర్శకులు అందరూ రావచ్చని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు రోజువారీ

కనీస వేతనం రూ.250 చెల్లించాలి

డ్వామా పీడీ రమేష్ రామన్

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేపట్టిన ఉపాధి కూలీలకు రోజువారీగా కనీస వేతనం రూ.250ల వేతనం కచ్చితంగా చెల్లించే బాధ్యత టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లుదేనని జిల్లా డ్వామా పిడి రమేష్ రామన్ చెప్పారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొలతల వారీగా చూపించి పనులు కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ లేదని చెప్పారు. వారికి పనులపై అవగాహన కల్పించి దగ్గరుండి చేయించి కనీస వేతనం చెల్లించే బాధ్యత మీదేనని చెప్పారు. గిరిజన ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లో వేతనం తగ్గే అవకాశం ఉండకూడదన్నారు. ఇకనుంచి అయినా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించే విధంగా చూస్తారా! లేదా అంటూ సమాధానం చెప్పాలని పీడీ ప్రశ్నించారు. చెల్లించే విధంగా పని కల్పిస్తామనీ వారు చెప్పారు.ఉపాధి హామీ పథకంలో భాగంగా సచివాలయ భవనాల నిర్మాణంకు జిల్లా వ్యాప్తంగా రూ.125 కోట్లు మంజూరై ఉందన్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్లకు బిల్లులు కాకపోవడంతో భవనాల నిర్మాణం ఆలస్యం జరుగుతుందన్నారు. పనులు జరిగిన వాటికి తక్కువగా మెటీరియల్ బిల్లులు పెట్టడం సరికాదని, కాంట్రాక్టర్లు ఏ దశ వరకు నిర్మిస్తే దాని వరకు కచ్చితంగా బిల్లులు చెల్లించే విధంగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటే భవనాలు వేగవంతంగా పూర్తవుతాయని చెప్పారు. లేనిపక్షంలో జిల్లాకు మంజూరైన నిధులు వేరే జిల్లాలకు మళ్లింపు అయ్యే పరిస్థితి ఉంటుందని, దీంతో భవన నిర్మాణ పనులు మరో రెండు, మూడేళ్లు ఆలస్యం జరిగే అవకాశం ఉందని పీడీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడి పవన్ కుమార్, చిరంజీవి పడాల్ ఏ డిఎల్‌డి ఆర్‌పి ఉదయ్ కుమార్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి సిహెచ్ రామచంద్రరావు, ఎంపీడీవో నగేష్, ఏపీవో దొరబాబు, ఉపాధి సిబ్బంది, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.




పబ్లిక్ హియరింగ్‌లో మాట్లాడుతున్న పీడీ

బలిమెల నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు

- ఎపి జెన్‌కో ఎస్ఇ ప్రశాంత్ కుమార్

ప్రజాశక్తి -సీలేరు : ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నుంచి 4000 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నామని ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయంలో ప్రస్తుతం ఇన్ ఫ్లో తక్కువగా ఉండడంతో బలిమెల జలాశయలో 2000 క్యూసెక్కుల నుంచి 4000 పెంచామని తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో జలాశయాలు నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో గోదావరి డెల్టా రబి పంటకు విద్యుత్ ఉత్పత్తి అనంతరం మాత్రమే నీటి విడుదల చేయడం సాధ్యపడుతుందని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి లేకుండా నేరుగా గోదావరి డెల్టాకి నీటిని విడుదల చేస్తే రానున్న వేసవికాలంలో సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తప్పదని వెల్లడించారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో ఆంధ్ర వాట కలుపుకొని ప్రస్తుతం 44.1591 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ నీటిని వచ్చే ఏడాది జూన్ నెల ఆఖరి వరకు పొదుపుగా వాడుకుంటే సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తలెత్తదని పేర్కొన్నారు. గోదావరి రివర్ బోర్డు ఇరిగేషన్ అధికారులు నీటి నిల్వల వివరాలు కోరారని తెలిపారు. రానున్న రోజుల్లో గోదావరి డెల్టా రబీ పంటకు ఏపీ జెన్కో ఉన్నతాధికారి ఆదేశాలకు అనుగుణంగా నీటి విడుదల చేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్



మాట్లాడుతున్న శ్రావణ్ త

టిడిపి హయాంలోనే గ్రామాల అభివృద్ధి

'బాదుడే బాదుడు'లో మాజీ మంత్రి శ్రావణ్

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: టిడిపి పార్టీ హయంలోనే గిరిజన గ్రామాల్లో అభివీద్ధి పనులు జరిగాయని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ చెప్పారు. మండలంలోని కొల్లపుట్టు పంచాయతీ చంపగూడ గ్రామంలో శనివారం బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం కనీసం గ్రామాలను పట్టించుకునే పరిస్థితిలో లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారం చేపట్టకు ముందు పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఎవరు మర్చి పోలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, అరకు పార్లమెంట్ టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి స్వామి, అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, సర్పంచ్ పాండురంగస్వామి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని మాదల పంచాయతీ ముసిరిగూడ గ్రామంలో శనివారం జనసేన పార్టీ నాయకులు, మాజీ ఎంపిటిసి సాయిబాబా దురియా, మాదల శ్రీరాములు, అల్లంగి రామకృష్ణ. మత్స్యరాజు పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాదలలో ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి నేటి వరకు నిర్మించకుండా చేతులు దులుపుకుందని చెప్పారు.

వాలంటీరు పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 50 గ్రామ వాలంటీర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 50 ఖాళీలు భర్తీతో అన్ని గ్రామ సచివాలయాలకు గ్రామ వాలంటీర్లు ఉంటారని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలలోని యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ వాలంటీర్ల భర్తీకి ఆయా మండలాల అభివృద్ధి అధికారులు ఈ నెల 07న నోటిఫికేషన్ జారీ చేస్తారని, ఈ నెల 8 నుండి 10 వరకు సాయంత్రం 5.గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. 11న దరఖాస్తులు పరిశీలించి 14న సెలక్షన్ కమిటీ మౌఖిక పరీక్ష నిర్వహిస్తుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 15వ తేదీన తెలియజేసి 16న ఒక రోజు శిక్షణను ఇచ్చి 17న నియామక ఉత్తర్వులు జారీ చేస్తారని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాలలో ఖాళీలను వెల్లడించారు. చింతూరు మండలంలో 10, జి.మాడుగుల మండలంలో 07, జి.కె వీధిలో 05, అడ్డతీగల, పాడేరులో నాలుగేసి, కొయ్యూరు, మారేడుమిల్లి, వి.ఆర్.పురం, వై. రామవరంలో మూడేసి,చింతపల్లి, రాజవోమ్మింగిలో రెండేసి, హుకుంపేట, డుంబ్రిగుడ, కూనవరం, రంపచోడవరం మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున వలంటీర్ల ఖాళీలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

భీష్మారావు ఆశయ సాధనకు కృషి

37వ వర్ధంతి కార్యక్రమాల్లో సిపిఎం నేతలు

ప్రజాశక్తి-చింతూరు

పేద ప్రజల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తూ అసువులు బాసిన సిపిఎం నేత, అమరజీవి కామ్రేడ్ బత్తుల భీష్మారావు ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. భీష్మారావు 37వ వర్ధంతి శనివారం శ్యామల వెంకటరెడ్డి స్మారక భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత భీష్మారావు చిత్రపటానికి ఆయన సతీమణి, తెలంగాణ రాష్ట్ర మహిళా సంఘం కార్యదర్శి బత్తుల హైమావతి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీలో కార్మికుల కష్టాన్ని దోచుకునే వారిపై ఎదురు తిరిగి ప్రశ్నించి గిట్టుబాటు కూలి సాధించడంలో కామ్రేడ్ భీష్మారావు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. భీష్మారావు ప్రజల మనిషిగా ఎదుగుదలను చూసి ఓర్వలేక ఆ నాటి పీపుల్స్ వార్ నక్సల్స్ 1985 నవంబర్ 5న విఆర్ పురం మండలం జీడిపప్పు నుండి వస్తుండగా హత్య చేశారని తెలిపారు. భీష్మారావు సతీమణి బత్తుల హైమావతి మాట్లాడుతూ నక్సల్స్ నాయకులను అయితే హతమార్చారేగాని వారి ఆశయాలను ఏమీ చేయలేకపోయారని, వారి ఆశయ సాధన కోసం నాటి నుండి నేటి వరకు ఎంతోమంది ప్రజా పోరాట ఉద్యమ బాటలో నడుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కుంజ సీతారామయ్య, మండల కార్యదర్శి సీసం సురేష్, ఎంపీటీసీ వేక రాజ్ కుమార్, ముర్రం లక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, ఐద్వా నాయకురాలు ముర్రం రంగమ్మ, పోడియం లక్ష్మణ్, సవలం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : కామ్రేడ్ బత్తుల భీష్మారావు వర్ధంతి సభ రేఖపల్లిలోని బొప్పిన భీమయ్య భవనంలో నిర్వహించారు. ముందుగా భీష్మారావు చిత్ర పటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం జరిగిన సభలో సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీలో అనేక ప్రజాతంత్ర ఉద్యమాలకు నాయకత్వం వహించిన వ్యక్తి భీష్మారావు అని కొనియాడారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో రానున్న కాలంలో మండలంలో సిపిఎంను గ్రామ గ్రామాన బలోపేతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, నాల్లారపు ప్రకాశరావు, కొమ్మల వెంకటరమణ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటపాక : ప్రజా ఉద్యమాల ద్వారా సీపీఎంకు పూర్వ వైభవం తీసుకురావడమే కామ్రేడ్ భీష్మారావు నిజమైన నివాళి అని సిపిఎం మండల కార్యదర్శి ఐవి అన్నారు. ఎర్రబోరు పార్టీ కార్యాలయంలో భీష్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐవి మాట్లాడుతూ భీష్మారావు లాంటి వారి త్యాగాల పునాదుల మీద సిపిఎం ప్రజా ఉద్యమాలు చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దేగల మాధవరావు, కాకా అర్జున్, ఐ పద్మ, పులుసు బాలకృష్ణ, నూతలపాటి సుధాకర్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



భీష్మారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

పోడు భూములకు పట్టాలివ్వాలి

సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-విఆర్.పురం

కూనవరం మండలం, పాలగూడెం గ్రామంలో గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములకు, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన్ కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలగూడెం గ్రామంలో శనివారం జరిగిన సిపిఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల సాగు భూములకు పట్టాలివ్వకుంటే ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపులో లేని పాలగూడెం, రామవరం గ్రామాలకు రోడ్డు, హౌసింగ్ కాలనీ మరుగుదొడ్లు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పార్టీ కూనవరం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, మండల కమిటీ సభ్యులు బాబు, టి.తమ్మయ్య, మడెం బాబూరావు, కొమరం బజారు, నూపా ముత్తయ్య, చెన్నకేశవరావు, నూప పొద్దయ్య, జుర్రే ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు

పలు పాఠశాలల్లో గిరిజన సంక్షేమశాఖ డీడీ తనిఖీలు

ప్రజాశక్తి- సీలేరు : జీకే మండలంలోని పలు పాఠశాలల్లో గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు శనివారం ఆకస్మిత తనిఖీలు నిర్వహించారు. తొలిత సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని, మెనూ ప్రకారం భోజనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తరగతి గదులకు వెళ్లి విద్యాబోధనపై ఆరా తీశారు. డైనింగ్ హాలు డ్రిల్స్ రంధ్రాల్లోంచి కిచెన్‌లోకి కోతులు ప్రవేశించి ఆహార పదార్థాలు చిందరవందర చేస్తున్నాయని వంట కుక్కులు డీడీ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఆయన కావాల్సిన సామాగ్రి కోసం ఇంజనీరింగ్ సిబ్బందితో ఎస్టిమేట్ వేయాలని హెచ్ఎంను ఆదేశించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దేవమణి, వార్డెన్ సకుంతల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో...

స్థానిక గురుకుల పాఠశాలకు శనివారం ఉదయం 6 గంటలకే డీడీ చేరుకొని తనిఖీలు నిర్వహించారు. వంటశాలలో ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాలలో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. పాఠశాలలో నీటి సమస్య అధికంగా ఉందని, ఓవర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని డీడీ దృష్టికి ప్రిన్సిపాల్ వెంకటరమణ తీసుకెళ్లారు. అనంతరం సీలేరు ఎంపీపీ పాఠశాలకు చేరుకొని నాడు-నేడు పనుల పురోగతిని ఉపాధ్యాయులు పుష్పరాజుని అడిగి తెలుసుకున్నారు.

దారకొండ, సప్పర్ల ఆశ్రమ పాఠశాలల్లో

దారకొండ, సప్పర్ల ఆశ్రమ పాఠశాలలను కూడా డీడీ కొండలరావు సందర్శించారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలపర్చకపోతే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. పాఠాలు బోధించే ముందు లెసన్ ప్లాన్ తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. డ్రాప్ అవుట్ ఉన్న విద్యార్థులు రెండు రోజుల్లో పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం నాడు నేడు పనులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో దారకొండ హెచ్ఎం సోమరాజు, వార్డెన్ రమేష్, సప్పర్ల హెచ్ఎం ఎస్.సత్యనారాయణ వార్డెన్ జ్ఞానేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రంలో అతిథి అధ్యాపకునిగా పనిచేయడానికి అర్హతలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృక్షశాస్త్రంలో పిజిలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. యుజిసి నెట్/ ఎపిసెట్, పిహెచ్‌డి అదనపు అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబర్ 14 తేదీలోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 9949229236, 9704762438 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మెరుగైన నైపుణ్యాలతో ఉపాధి

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ రామ్మోహన్‌రావు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానం, మెరుగైన నైపుణ్యాలు అందించడం వల్ల ఉపాధి అవకాశాలు విస్తృతం అవుతాయని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు అన్నారు. శనివారం ఉదయం ఎన్ఇపి 2020 ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్ ఫర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దీనిని కార్యరూపంలో చూపుతూ 10 నెలల ఇంటర్న్‌షిప్‌ను అందిస్తున్న విధానం వివరించారు. అనుబంధ కళాశాలలు నాక్ గుర్తింపును పొందే విధానం వివరించారు. దీనిపై కళాశాలలకు అనేక అపోహలు, సందేహాలు ఉన్నాయనే అంశాన్ని ప్రస్తావిస్తూ వాటిని నివృత్తి చేశారు. కళాశాలకు అవసరమైన భవనం, తరగతిగదులు, మౌలిక వసతులు ఉన్న కళాశాలలు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. బోధన సిబ్బంది అంశంలో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కరికులం అమలు చేసే బోధన సిబ్బంది ఉన్న ప్రతి కళాశాలా నాక్ గుర్తింపుకు వెళ్లవచ్చున్నారు. ఐదేళ్ల కాలానికి నాక్ గుర్తింపును పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధానాలను వివరించారు.

వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, అనుబంధ కళాశాలలు త్వరలో నాక్ గుర్తింపును సాధించాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, గ్లోబల్ మార్కెట్‌కు ఉపయుక్తంగా యువతను తయారుచేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. టెక్నాలజీని విద్యలో మిళితం చేయాలని సూచించారు. వివిధ ర్యాంకింగ్ సంస్థలకు అందించే సమాచారంలో స్పష్టత, ఖచ్చితత్వం కలిగి ఉండాలన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ, అందరికీ నాణ్యమైన విద్యను అందించడం నూతన విద్య విధానం 2020 లక్ష్యమన్నారు. నాలెడ్జ్ సూపర్ పవర్‌గా భారత్ నిలుస్తుందన్నారు. నాక్ గుర్తింపు నాణ్యతకు చిహ్నంగా నిలుస్తుందనే విషయం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ లెవెల్ నాక్ చైర్మన్ ఆచార్య కె.రాంజీ, ఆచార్య పి.సునీత, ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలి

ప్రజాశక్తి-గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం రంగంలోనే కొనసాగించాలని వైఎస్ఆర్‌టియుసి నాయకులు శనివారం ఎంపీ ఎంవివి.సత్యనారాయణను కలిసి కోరారు. ఈ నెల 11వ తేదీన విశాఖ వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ప్రజల ఆకాంక్షను తీసుకెళ్లి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ సంస్థగానే కొనసాగించే ప్రకటన చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, గొందెసి వెంకటరమణారెడ్డి, పిట్టా రెడ్డి, కర్రి దాలినాయుడు, బోరా శశిభూషణరావు, గొందేశీ అప్పలరెడ్డి, గెద్దాడ అప్పలరాజు, కూటికుప్పల జనార్దన్, బి.రామకృష్ణ శకునాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు కేంద్రంపై ఒత్తిడి

ప్రజాశక్తి-విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషిచేయాలని టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు విజ్ఞప్తి చేశారు. పెదగంట్యాడ యూనియన్ కార్యాలయంలో పాండురంగ జయరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు వేర్వేరుగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించొద్దని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా స్టీల్ ఉత్పత్తిని తగ్గించి కంపెనీకి నష్టం చేస్తూనే ఉందని వివరించారు. కనుక అన్ని రాజకీయ పార్టీలూ ఐక్యంగా ఒత్తిడి తేవాలని కోరారు. ఈ సమావేశంలో కరణం సత్యారావు, ఎమ్.ప్రకాష్‌యాదవ్, ఎమ్‌కె.రెడ్డి, బొడ్డు రమణ, జె.జాన్, డి.నరసింగరావురెడ్డి, కె.సోమేష్, యు.సింహాద్రి అప్పన్న, పేర్ల నూకరాజు, ఎం.అప్పలరెడ్డి పాల్గొన్నారు.

మినీ రోల్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన జివిఎంసి 50వ వార్డు పరిధి మాధవధార వైశాఖి స్పోర్ట్స్ పార్కులో 3వ సౌత్ ఇండియా మినీ రోల్ బాల్ ఛాంపియన్ షిప్ 2022-23 పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్‌రాజు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు ప్రెసిడెంట్ సనపల వరప్రసాద్, బి.సూర్యనారాయణ, శాంతి భూషణ్, ఎంవి.రెడ్డి, కె.విశ్వనాధ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరానికి విశేష స్పందన

భారీగా తరలివచ్చిన విభిన్న ప్రతిభావంతులు
15 మంది వైద్యుల బృందం పరీక్షలు



భారీగా తరలి వచ్చిన వికలాంగులు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పోలీస్ శాఖ, ఐటీడీఏ సంయుక్తంగా చింతపల్లిలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన మెగా సదరం శిబిరానికి విశేష స్పందన లభించింది. చింతపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సదరం శిబిరంలో రెండు రోజులు జిల్లాలోని పలు మండలాల నుంచి అధిక సంఖ్యలో వికలాంగులు తరలి వచ్చారు. వైకల్యంపై పరీక్షలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తించి తక్షణమే సదరం ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు. కేవలం కొన్ని గంటల్లోనే అర్హులైన వికలాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలను అందజేసేందుకు చర్యలు చేపట్టడం విశేషం. చెవిటి, మూగ, అంధత్వం, మతిస్థిమితం, ఎముకలు వంటి పలు విభాగాలకు చెందిన నిపుణులైన 15 మంది డాక్టర్ల బృందంతో ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి, మునుపెన్నడు లేని విధంగా అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించారు. తక్షణమే సదరం ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడంపై సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సదరం శిబిరం నిర్వహణను దగ్గరుండి పర్యవేక్షించిన గ్రామ వార్డు సచివాలయ కమిషనర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ, వికలాంగులకు ఈ మెగా సదరం శిబిరం ఎంతగానో తోడ్పడుతుందని, తక్కువ వ్యవధిలో సదరం సర్టిఫికెట్ పొంది ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు పథకాలకు అర్హులవుతారని ఆయన చెప్పారు.

జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదరం శిబిరంలో దివ్యాంగులు సర్టిఫికెట్లు పొందేందుకు సహకరించిన చింతపల్లి సబ్ డివిజన్ పోలీసులకు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు ధన్యవాదా తెలియజేశారు. ఇటువంటి క్యాంపులను అల్లూరి సీతారామరాజు జిల్లాలో మరికొన్నింటిని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ, ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాలలో వివిధ వైకల్యాలతో అనేకమంది ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, సదరం ధ్రువీకరణ పత్రం లేక ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. వీటిని గుర్తించి ప్రభుత్వ సహకారంతో ఈ సదరం శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇదిలా ఉండగా చింతపల్లిలో జరిగిన రెండు రోజుల మెగా సదరం శిబిరానికి కొయ్యూరు, జికె వీధి, చింతపల్లి మండల మారుమూల గ్రామాల నుండి సుమారు 1400 మంది దివ్యాంగులు ఈ క్యాంపునకు హాజరయ్యారు. వీరిలో ఇప్పటివరకు 255 మందికి సర్టిఫికెట్లు జారీ చేశారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని...

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ పరిధి మారుమూల రాచకిలం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు శనివారం గ్రామంల శరీరానికి ఆకులు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఎన్నాళ్లు ఈ డోలి మోతలు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ గెమ్మెల జమ్ములు మాట్లాడుతూ, ఎన్ని రాజకీయ పార్టీలు మారినప్పటికీ తమ గ్రామం అభివృద్ధి చెందలేదని, కనీసం రోడ్డు సౌకర్యం లేక రోగులను డోలి సహాయంతో కొండ కోనల నడుమ నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరం మోసుకుంటూ చింతపాక మెయిన్ రోడ్డుకు వెళ్ళవలసిన పరిస్థితి వస్తుందని తెలిపారు. గత నెలలో అనారోగ్యంతో వైద్యం అందక ఇద్దరు గిరిజనులు మృతి చెందారని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతుందని, పండించిన అటవీ ఉత్పత్తులు భుజంపై మోసుకుంటూ పినకోటలో శనివారం జరిగే వారపు సంతలో విక్రస్తున్నామని ఆయన అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.



ఆకులు కట్టుకొని నిరసన తెలుపుతున్న గిరిజనులు

108లో గర్భిణి ప్రసవం : తల్లీబిడ్డ సురక్షితం

ప్రజాశక్తి-పెదబయలురూరల్: మండలంలోని అరడకోట పంచాయతీ బొంగదరి గ్రామానికి చెందిన చెందిన గర్భిణీ వంతాల చిలకమ్మ 108లో ప్రసవించింది. ఆమెకు పురిటి నొప్పుల రావడంతో గ్రామానికి చేరుకున్న 108 వాహనంలో ఆమెను తరలిస్తుండగా మార్గ మధ్యలో ఆడ శిశువు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ సురక్షితంగా ఉన్నారని అంబులెన్సు సిబ్బంది రమణారావు, రమేష్ తెలిపారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. ఎస్ రాయవరం మండలం కొరుప్రోలు గ్రామానికి చెందిన కొంగర సూర్యచంద్ర మనోరాజ్యలక్ష్మి (35) అక్క అమ్మాయి శరణ్యతో కలిసి బైక్ పై తుని వెళ్లి వస్తుండగా నక్కపల్లి హైవే జంక్షన్ వద్ద వెనుక నుండి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెనక కూర్చున్న కొంగర సూర్యచంద్ర మనోరాజ్యలక్ష్మి రోడ్డుపై పడటంతో లారీ ఆమెపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు 9 సంవత్సరాల అమ్మాయి ఉంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆనందపురం : పశువులకు సంక్రమించే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రౌతు శ్రీను సూచించారు. పాలవలస గ్రామంలో పశు విజ్ఞానబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పశువులకు వ్యాధులు ప్రబలి అనారోగ్యానికి గురవుతున్నాయని తెలిపారు. గత కొంత కాలంగా పశువులకు ముద్ద చర్మ వ్యాధి అధికంగా వస్తోందన్నారు. ఈ వ్యాధిని గుర్తించి ముందుగానే మేల్కోపోతే పాడి రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటుందన్నారు. పాడి రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్ లీలారాణి పశువులకు ఎల్ఎస్‌డి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎహెచ్ఎ రఘురాం, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : 2022 - 23 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు దరఖాస్తు గడువును నవంబరు 15 వరకు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఇప్పటి వరకు ఈ పరీక్షకు 1818 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షను 2023 జనవరి 5న రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్ సైట్ www.bse.ap.gov.in నుగానీ, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలన్ని గానీ సంప్రదించాలని సూచించారు.


సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎండిఒ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సభ్యుల సాధారణ సమావేశం నిర్వహించారు. ఎంపిపి దంతులూరి వెంకటశివసూర్య నారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఫిర్యాదులతో నిమిత్తం లేకుండా ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను గుర్తించి, వాటిని సరి చేయాలని ఎపిఇపిడిసిఎల్ అధికారులకు సూచించారు. విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన స్థలాల్లో నిర్ణీత సమయంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, కార్యాలయ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు బోని బంగారు నాయుడు, సురపతి దుర్గాలమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎండిఒ పి.వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండో సెమిస్టర్ పుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండల విద్యాశాఖ కార్యాలయంలో సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని ఎంఇఒ ఎస్.పద్మావతి తెలిపారు. గతంలో మొదట, మూడవ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయని, రెండవ విడత సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు కార్యాలయానికి చేరుకున్నాయని పేర్కొన్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయని తెలిపారు. వీటిని ఆయా పాఠశాలలకు పంపించినున్నట్లు పేర్కొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ

అంగన్‌వాడీల సమస్యలపై ఉధృత పోరాటాలు

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ అండ్ హెల్పర్ల యూనియన్ రేఖపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఐదవ మహాసభ యూనియన్ నాయకురాలు కనక లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, అంగన్వాడీ వర్కర్లకు కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కలిపించాలని, టీఏ, డీఏ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం ప్రాజెక్ట్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం గౌరవాధ్యక్షులుగా రంగమ్మ, అధ్యక్షులుగా నాగమణి, కార్యదర్శిగా రాజేశ్వరి, కోశాధికారిగా కె.కనకలక్ష్మి, ఆఫీసు బేరర్స్‌గా సునీత, సుజాత నాంచారి, దూలమ్మ, ఎస్ సుబ్బలక్ష్మి, పి.సత్యవతి. శైలజ, ఎం సూర్యాంబ, ఎం.కవిత, రాధాకుమారి, పండు మంగతాయారు, 19 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

మారేడుమిల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లిలో శనివారం రంపచోడవరం మెజిస్ట్రేట్ ప్రవీర్ వర్మ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ ప్రవీర్ వర్మ మాట్లాడుతూ ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా యువకులు బాల్య వివాహాలపైనా, ఫోక్సో చట్టంపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. మారేడుమిల్లి సిఐ అద్దంకి శ్రీనివాస్, మాట్లాడుతూ యువత మత్తు పానీయాలకు, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. ఒక్కసారి గంజాయి రవాణాతో దొరికితే వారిపై నాన్ బెయిల్ బుల్ కేసులు పెట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సుక్క సంతోష్, మారేడుమిల్లి ఎస్సై ఎస్.రాము, ఈతపల్లి సిరిమల్లె రెడ్డి. ఏపీ ఆర్ కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి వచ్చిన రోగులకు సిబ్బంది సకాలంలో వైద్య సేవలు అందించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. శనివారం ఆయన రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రి వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు జ్వరం, డెంగ్యూ లక్షణాలు ఉంటే తక్షణమే రక్త పరీక్షలు చేయాలన్నారు. ఆసుపత్రిలో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయా వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఐరిస్క్ గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థికస్థితిపై యనమల అసత్య ప్రచారం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాష్ట్ర ఆర్థికస్థితిపై మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అసత్య ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం సాయంత్రం ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు తాను మేధావిగా యనమల ఊహించుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక మంత్రిగా యనమల చేసిన ఆర్థికపరమైన అన్యాయాలు, రాష్ట్రానికి చేసిన అన్యాయాలు మర్చిపోయి, వాటన్నింటినీ ప్రస్తుత ప్రభుత్వంపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-చింతూరు

గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రంపేట గ్రామంలో గిరిజన సంఘం చింతూరు మండల 8వ మహాసభకు లోతా రాంబాబు విచ్చేసి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలన్నింటినీ తీసివేస్తూ ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. గిరిజనులను అడవి నుండి వెళ్లిగొట్టే ప్రయత్నం చేస్తున్న బిజెపి ప్రభుత్వం చేస్తుందన్నారు. అడవిని నమ్ముకుని బతుకుతున్న ఆదివాసి కుటుంబాలపై ఫారెస్ట్ అధికారులు దాడులు చేయడం దారుణమన్నారు.



మాట్లాడుతున్న లోతా రామారావు

నూతన కమిటీ ఎన్నిక

ఈ మహాసభలో గిరిజన సంఘం చింతూరు మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా పంద్రమ్ నాగార్జున, కారం నాగేష్, కోశాధికారిగా సీసం సురేష్, సహాయ కార్యదర్శులుగా మొట్టం రాజయ్య, కలుముల మల్లేష్, సోడి సవలం, దేశయ్య, ఉపాధ్యక్షులుగా కుర్సం బ్రహ్మయ్య, దుబి లక్ష్మయ్య, వేక రాజకుమార్, సోడి చిన్నమ్మ, మరో 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పులి సంతోష్, నాయకులు కుంజ సీతారామయ్య, ముర్రం రంగమ్మ, ఎంపీటీసీలు వేక రాజకుమార్ ముర్రం లక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని యుటిఎఫ్ నాయకులు ఎస్.రాజుబాబు, ఎం.ఉదయ్, డి పైడిమల్లి, ఎం రమేష్, సాదనపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో యుటిఎఫ్ మండల సమావేశం డి.పైడిమల్లి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానం వెంటనే రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి యుటిఎఫ్ నాయకత్వం కృషి చేస్తుందన్నారు. ఇటీవల రాజస్థాన్, పంజాబ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో సిపిఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేసినట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా సిపిఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేయడం సరికాదన్నారు. సిపిఎస్ విధానం రద్దయ్యేవరకు యూటీఎఫ్ పోరాడుతుందన్నారు. అనంతరం సిపిఎస్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది సిపిఎస్ కన్వీనర్‌గా సాధనపల్లి సత్యనారాయణ, కో కన్వీనర్లుగా అడాల సతీష్, రెడ్డి లక్ష్మి, మండల కార్యదర్శులుగా ఈకా బాపూజీ, టి నరసింహమూర్తి, వాసిరెడ్డి సత్యవతి, టి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు పి రమణ, వెంకటలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, ఎం సత్యవతి, నీలాద్రి రాజబాబు, పరిశిక సుబ్బారావు, బూడి శ్రీనుబాబు, కారం శ్రీను, త్రినాథ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణను అడ్డుకోండి

- సిఎంకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకుని రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజలకు అండగా నిలవాలని కోరుతూ సిఎం జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ రాసింది. అందులోని వివరాలను వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ శనివారం మీడియాకు వివరించారు. ఇప్పటికే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పు లేదు.. సరికదా ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మి తీరతామని కేంద్ర మంత్రులు పదేపదే ప్రకటిస్తున్నారన్నారు. అలా అమ్మడం సాధ్యం కాని పక్షంలో పరిశ్రమను మూసేస్తామేగానీ నడపబోమని కేంద్ర మంత్రులు పార్లమెంటు సాక్షిగానే ప్రకటన చేసిన విషయాన్ని అజశర్మ గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు వ్యక్తులకు అమ్మినా, మూసివేసినా రాష్ట్ర ప్రయోజనాలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు తీరని హాని జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకొని కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపహరించుకునేలా చేయడం రాష్ట్ర ప్రయోజనాల రీత్యా అత్యవసరమన్నారు. ప్రధాని మోడీ ఈ నెల 11, 12 తేదీలలో విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో అది రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని అజశర్మ ఉటంకించారు. విశాఖలో జరిగే ప్రధాని సభలో ఆయనతోపాటు తమరూ ఉన్నందున స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రధానిని అడగాలని సిఎంను కోరారు.

మావోయిస్టుల చేతిలో సర్పంచ్ భర్త హతం ?

ప్రజాశక్తి - చింతూరు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడలో ఓ మహిళా సర్పంచ్ భర్తను మావోయిస్టులు హత్య చేసినట్టు ఆ ప్రాంతంలో చెప్పుకుంటున్నారు. మలంగర్ ఏరియా కమిటీ ఈ ఘాతుకానికి పాల్పడినట్టు సమాచారం. హత్యలో మావోయిస్టుల పాత్రపై ఇంకా స్పష్టత రాలేదని పోలీసులు పేర్కొంటున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం.. అరన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మలంగర్ ఏరియా కమిటీకి చెందిన ఐదారుగురు సాయుధ మావోయిస్టులు శుక్రవారం అర్ధరాత్రి రేవాలి గ్రామానికి చేరుకున్నారు. సర్పంచ్ భర్త భీముడు బార్సేను అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లారు. శనివారం ఉదయం గ్రామంలో బార్సే మృతదేహం కనిపించింది. అనంతరం గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. భద్రతా బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ఘటనపై దంతెవాడ ఎస్‌పి సిద్ధార్థ్ తివారీ స్పందించారు. హత్యపై సమాచారం అందిందని, మావోయిస్టులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారా ? లేక మరెవరి హస్తమైనా ఉందా ? అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



చింతపల్లికి బయలుదేరిన విభిన్న ప్రతిభావంతులు

సదరం క్యాంపునకు విభిన్న ప్రతిభావంతుల తరలింపు

ప్రజాశక్తి - కొయ్యూరు : చింతపల్లిలో వికలాంగుల కోసం నిర్వహించిన సదరం క్యాంపునకు కొయ్యూరు సిఐ ఎ.స్వామినాయుడు, ఎస్ఐ రాజారావు, మంప ఎస్ఐ లోకేష్ కుమార్ నేతృత్వంలో వికలాంగులను తరలించారు. మండల నలుమూలల నుండి అధికసంఖ్యలో వికలాంగులు హాజరయ్యారు. సదరం క్యాంపుపై పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసి వికలాంగులను సదరం క్యాంపుకు తరలించారు. కొందరు వికలాంగులు తాము వచ్చిన వాహనాల నుండి వైద్యనిపుణుల వద్దకు నడిచివెళ్లలేక ఇబ్బంది పడుతుండటాన్ని గమనించిన కొయ్యూరు సీఐ స్వామి నాయుడు మంప ఎస్సై లోకేష్, జికెవీధి ఎస్ఐతో కలిసి ఆ వికలాంగులను వైద్య పరీక్షల వద్దకు స్వయంగా మోసుకెళ్లారు.

పవన్‌కు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన ఆవిర్భావ సభకు స్థలం ఇచ్చిన మంగళగిరి ప్రాంతంలోని ఇప్పటం గ్రామస్తుల గృహాలను రోడ్డు విస్తరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్యంగా తొలగించడం దుర్మార్గమని జనసేన పిఎసి సభ్యుడు కోన తాతారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకరరావు అన్నారు. ఇప్పటం గ్రామస్తులకు సంఘీభావం తెలుపుతూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ప్రాణాలకు ముప్పు వాటిల్లే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పవన్ కల్యాణ్‌కు జెడ్ ప్లస్ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రధాని పర్యటన రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 12న విశాఖపట్నంలో జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభా కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమమని, సిఎం జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాజ్యసభ సభ్యులు, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీకి చెందిన జివిఎంసి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వార్డు ఇన్‌ఛార్జిలతో ఆయన శనివారం సమావేశమై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు